www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 26 మే 2024



రోహిణి కార్తె ప్రారంభం

కనిపించని సూర్యుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రోహిణి కార్తె ప్రారంభం రోజు శనివారం సూర్యుడు కనిపించకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మారిన వాతావరణంతో శనివారం రోజంతా మబ్బులు, చిరు జల్లులతో వాతావరణం చల్లబడింది. వాతావరణ శాఖ అల్పపీడనం వాయుగుండంగా, తుఫాన్‌గా మారుతుందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వాతావరణం గత కొన్ని రోజులకు భిన్నంగా చల్లబడింది. గత మూడు రోజులుగా ఇదే రకంగా వాతావరణ ఉండటంతో నెల రోజులు పాటు తీవ్ర వేడి, ఉక్క బోతతో ఉక్కిరి బిక్కిరైనా ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఇంకా రబీ పంట ఒబ్బిడి చేసుకోని రైతులు మాత్రం మారిన వాతావరణంకు ఆందోళన చెందుతున్నారు.



మేఘావృతమైన ఆకాశం



మూడో పంట.. మాయం..!

డెల్టాలో వేసవి అపరాల సాగు కనుమరుగు - రైతుల అదనపు ఆదాయానికి గండి

భూసారంపై సైతం తీవ్ర ప్రభావం - గతంలో పెద్దఎత్తున అపరాల సాగు

1న సాగునీరు విడుదల చేసినా ప్రయోజనం శూన్యం

వ్యవసాయ శాఖ ప్రణాళికా లోపమేనని విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోని డెల్టా ప్రాంతంలో మూడో పంట కనుమరుగైంది. గతంలో వేసవి సీజన్‌లో మినుము, పెసర వంటి ఆరుతడి పంటలకు ప్రసిద్ధి చెందిన డెల్టా ప్రాంతంలో కొన్నేళ్లుగా వాటి ఆనవాళ్లు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతుల అదనపు ఆదాయానికి గండి పడింది. దీనికి ప్రధాన కారణం జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికా లోపమేననే విమర్శలు విన్పిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 5.29 లక్షల ఆయకట్టు ఉంది. ఆక్వా చెరువులు పోను 4.80 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. గతంలో వేసవి పంటగా మినుము, పెసర వంటి పంటలతోపాటు పశువుల మేతగా పిల్లి పెసర వంటి పంటని రైతులు పండించేవారు. పంట కోత కోసే ముందు రోజు ఈ విత్తనాలను పొలాల్లో చల్లేవారు. మే నెలాఖరుకు ఆరు తడి పంటలను రైతులు మాసూళ్లు చేసేవారు. ఎకరాకు ఉత్పత్తుల లెక్కించినా ఆరుతడి పంట కింద రూ.పది వేల వరకూ రైతులు ఆదాయం పొందేవారు. అంతేకాకుండా పశువులకు పుష్కలంగా మేత దొరకడంతోపాటు ఆరుతడి పంటలు వేయడంతో భూసారం బాగా పెరిగేది. భూసారం బాగా ఉండటంతో ఖరీఫ్, రబీ సీజన్లలో దిగుబడులు బాగా వచ్చేవి. ఖరీఫ్, రబీ పంటల్లో ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలు చవిచూసినప్పటికీ వేసవి అపరాల పంటలతో రైతులు కొంత ఉపశమనం పొందేవారు. గడిచిన కొన్నేళ్లుగా డెల్టాలో వేసవి అపరాల పంట పూర్తిగా కన్పించని పరిస్థితి నెలకొంది. దీనికి కారణం ఖరీఫ్ సాగు ఆలస్యం కావడం, దీంతో రబీ సాగు మరింత ఆలస్యం కావడంతో వేసవి ఆరుతడి పంటలు వేసేందుకు వీలు కుదరని పరిస్థితి నెలకొంది. దీనికి జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళిక లోపమే కారణమని చెబుతున్నారు.

2014లో టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడో పంట సాగుకు ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగింది. అందుకుగాను జూన్ ఒకటో తేదీనే పంట కాలువలకు సాగునీరు విడుదల చేయడం ప్రారంభించింది. దీంతో మళ్లీ మూడో పంట సాగు కొంత పుంజుకుంది. అయితే అది మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం మూడో పంటను పూర్తిగా వదిలేసింది. దీంతో జూన్ ఒకటిన సాగునీరు విడుదల చేస్తున్నప్పటికీ నారుమడులు సకాలంలో వేసేవిధంగా రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖ విఫలమవుతోంది. దీంతో జూన్ నెలాఖరు వరకూ ఖరీఫ్ నారుమడులు పడటం లేదు. రబీ ఆలస్యమవుతోంది. జనవరి నెలాఖరు వరకూ రబీ నాట్లు పూర్తి కావడం లేదు. దీంతో ఏప్రిల్ మూడో వారంలో కోతలు ప్రారంభమై మే పదో తేదీ వరకూ రబీ మాసూళ్లు కొనసాగుతున్నాయి. అదును తప్పడంతో వేసవి ఆరుతడి పంటలను రైతులు వేయడం లేదు. కొంతమంది రైతులు వేసినప్పటికీ పండకపోవడంతో ఆరుతడి పంటలను పూర్తిగా పక్కన పెట్టేశారు. దీంతో రైతులు ఆదాయం కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాదైనా కాలువలకు సాగునీరు విడుదల చేసిన వెంటనే నారుమడులు వేస్తే ఆరుతడి పంటలకు అవకాశం ఉంటుంది. వ్యవసాయశాఖ ఆ విధంగా ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగాలని రైతులు కోరుతున్నారు. ఆరుతడి పంటలకు ఖర్చు కూడా తక్కువ కావడంతో కోతలు కోసేముందు ఆరుతడి పంట విత్తనాలను చల్లుతారు. కోత మిషన్లతో మాసూళ్లు చేయడం కారణంగా విత్తనాలు కొంతమేర దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతోంది. విత్తనాలు చల్లాక ఏ విధంగా ఉండాలనే దానిపై వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా మినుములు, పెసలు దాదాపు రూ.పది వేల వరకూ ధర పలుకుతున్నాయి. రైతులు ఆరుతడి పంటలు పండిస్తే ప్రజలకు ధరలు అందుబాటులోకి రావడంతోపాటు, రైతులకు అదనపు ఆదాయం వచ్చే. జిల్లాలో డెల్టా ప్రాంతంలో ఆరుతడి పంటలను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకుంటే జిల్లా రైతాంగానికి మేలు జరుగుతుంది.

ఓట్ల లెక్కింపు బాధ్యతాయుతంగా నిర్వహించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఓట్ల లెక్కింపు ప్రక్రియను కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక హోటల్ ఆనంద ఇన్ కాన్ఫరెన్స్ హాలులో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఏడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు రెండు కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు, బివి.రాజు కళాశాలలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారన్నారు. ప్రతి కౌంటింగ్ హాల్లో రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్లు ఉంటారని తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు కౌంటింగ్ ఏజెంట్లతో వాగ్వివాదం చేయరాదని సూచించారు. వైర్ మెస్ ద్వారా ప్రదర్శించబడిన ప్యానెల్ ఫలితాలను కౌంటింగ్ ఏజెంట్లు స్పష్టంగా చూడగలిగే విధంగా కౌంటింగ్ అసిస్టెంట్ సియుని పట్టుకోవాలని సూచించాలన్నారు. ఇవిఎంలో రిజల్ట్ మళ్లీ చూపించాలని కోరిన సందర్భంలో కచ్చితంగా చూపించాలని ఆదేశించారు. కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు ఉదయం ఏడు గంటలకు తమ తమ సీట్లలో కూర్చున్న తర్వాత కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఎవరూ కౌంటింగ్ హాలు నుండి బయటకు వెళ్లడానికి అనుమతించబడదన్నారు. ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభిస్తారని, 8.15 గంటలకు ఇవిఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారని తెలిపారు. 14 టేబుల్స్ ఇవిఎం ఓట్ల లెక్కింపు నకు, నాలుగు టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్‌కు, ఒక టేబుల్ సర్వీస్ ఓటర్ల ఇటిపిబిఎస్ ఓట్ల లెక్కింపు నకు ఏర్పాటు చేస్తారన్నారు. సుమారు 14 నుండి 19 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుందన్నారు. లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును ధరించాలని, అవి లేకపోతే లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తొలివిడత లెక్కింపు, మలివిడత లెక్కింపు ప్రక్రియలను వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, ఉండి నియోజకవర్గ రిటర్నింగు అధికారి సివి.ప్రవీణ్‌ఆదిత్య, జిల్లా, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, రిటర్నింగు అధికారులు వి.స్వామినాయుడు, ఎం.అచ్యుత అంబరీష్, కె.శ్రీనివాసులురాజు, బి.వెంకటరమణ, కె.చెన్నయ్య, బి.శివనారాయణరెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, ఎన్నికల సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ మద్రాపు సన్యాసిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఓట్ల లెక్కింపు అత్యంత కీలకం

ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్‌ఆదిత్య

చిట్‌చాట్



ప్రజాశక్తి -కాళ్ల

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, దీన్ని సజావుగా, పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలతోపాటు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు ఉండి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. 17 రౌండ్లలో ఉండి నియోజకవర్గ ఫలితం వెలువడుతుందన్నారు. ముందుగా ఆకివీడు మండలం పెదకాపవరం ఒకటో పోలింగ్ స్టేషన్ నుంచి ఓట్ల లెక్కింపు మొదలై ఆఖరు పిఎస్ మాలవానితిప్ప పోలింగ్ బూత్ 238తో కౌంటింగ్ పూర్తవుతుందన్నారు.

ప్రశ్న:ఉండి నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి?

ఆర్ఒ: ఉండి నియోజకవర్గంలో 238 పోలింగ్ కేంద్రాల్లో 2,24,725 మంది ఓటర్లకుగాను 1,93,783 ఓట్లు పోలయ్యాయి. 86.20 శాతం పోలింగ్ నమోదైంది.

ప్రశ్న: పోస్టల్ బ్యాలెట్‌ను ఎంతమంది వినియోగించుకున్నారు?

ఆర్ఒ: 1657 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. హోమ్ ఓటింగ్‌లో 146 ఓట్లు పోలయ్యాయి.

ప్రశ్న: టేబుల్స్ ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?

ఆర్ఒ: ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా వేర్వేరుగా 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేస్తున్నాం. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు మరో నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: అభ్యర్థులు తమ ఏజెంట్లను ఎప్పటిలోగా నియమించుకోవాలి?

ఆర్ఒ: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఏజెంట్లను ఈ నెల 31వ తేదీలోగా నిర్ణీత నమూనాలు అందజేసి నియమించుకోవాలి.

ప్రశ్న: కౌంటింగ్ రోజు ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఆర్ఒ: కౌంటింగ్ రోజున వివిధ మండలాల నుండి ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానులు కౌంటింగ్ కేంద్రాల వద్దకు రాకూడదు. కౌంటింగ్ అనంతరం ఎలాంటి ర్యాలీలు, విజయోత్సవ సభలు నిర్వహించరాదు. కౌంటింగ్ సెంటర్‌లో కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: ఓట్ల లెక్కింపులో ఎవరి పాత్ర కీలకం?

ఆర్ఒ: పోస్టల్ బ్యాలెట్‌లో డిక్లరేషన్‌పై సంతకం ఉన్నదీ, లేనిదీ జాగ్రత్తగా పరిశీలించాలి. ఆర్ఒ, అబ్జర్వర్ల పాత్ర కీలకం. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులూ సహకరించాలి.

ఒఎన్‌జిసి పైపులైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

రుస్తుంబాద్‌లో ఒఎన్‌జిసి పైపులైన్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. కొన్ని రోజుల క్రితం పోలీసు బందోబస్తు నడుమ పనులు చేపట్టడానికి అధికారులు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. దీనిపై గ్రామస్తులు, రైతులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ రెండుసార్లు చర్చల అనంతరం గ్రామస్తులు పనులకు అంగీకరించారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ధాన్యం దింపుకోలేదని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక రైల్వే స్టేషన్ దగ్గరలో ఉన్న వెంకటరామ రైస్‌మిల్లుకి ఆర్‌బికె ఇచ్చిన పత్రాల ప్రకారం ధాన్యం తీసికెళితే తీసుకోలేదని మండలంలోని కాళింగి గూడెం రైతులు చేపట్టిన 24 గంటల ఆందోళన శనివారం మధ్యాహ్నం ప్రశాంతంగా ముగిసింది. విషయంలోకి వెళ్తే మండలంలోని కాళింగి గూడెం గ్రామానికి చెందిన ఉప్పాడ రామాంజనేయులు అనే రైతు తాను పండించిన ధాన్యం అమ్మేందుకు ఆర్‌బికె కేంద్రానికి వెళ్లాడు. అక్కడ తేమశాతం చూసి ధాన్యాన్ని ఆకివీడు వెంకటరామకృష్ణ రైస్ మిల్లుకు తీసుకెళ్లవలసిందిగా చెబుతూ పత్రాలు అందజేశారు. ఆర్‌బికె ఆదేశాల మేరకు రైతు తన ధాన్యాన్ని స్థానిక రైస్ మిల్‌కు శుక్రవారం మధ్యాహ్నం తీసుకువచ్చాడు. అయితే ధాన్యం చితుకు ఎక్కువవుతోందని, నిబంధనలకు దాటి ఉన్నందున తమ యజమాని వస్తే తప్ప తాము తీసుకోలేమని వారు స్పష్టం చేశారు. దాంతో ధాన్యం లోడింగ్ ట్రాక్టర్ అక్కడి నుంచి పోయింది. సాయంత్రం 6 గంటలకు వచ్చిన రైస్ మిల్లర్ గమిని సురేష్ ధాన్యం తీసుకునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. తమకు నష్టం వస్తుందని, నష్టం చెల్లిస్తే తీసుకోగలుగుతామన్నారు. 33 శాతం నూక వరకు ప్రభుత్వం అనుమతిస్తుందని, ఇప్పుడు ఈ ధాన్యంలో 60 శాతం దాటి నూక వస్తోందన్నారు. పొద్దు పోవడంతో నిరాకరించడంతో ధాన్యం అక్కడే ఉంచి రాత్రి 9 గంటలకు రైతు వెళ్లిపోయాడు. తెల్లవారక ముందే మళ్లీ వచ్చి తన ప్రయత్నాలు ప్రారంభించాడు. ఈ దశలో అతనికి తోడు ఆ గ్రామ రైతులు మరో 20 మంది అక్కడికి వచ్చారు. వచ్చేముందు వారు సివిల్ సప్లైస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసి వచ్చారు. ఆ మేరకు సీల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ ఇన్‌ఛార్జి మహేష్, వ్యవసాయ శాఖ అధికారి ప్రియాంక, సహాయ సంచాలకులు శ్రీనివాసరావు అక్కడికి వచ్చి మిల్లర్‌తో మాట్లాడారు. అయితే ఆయన తాను నిబంధనలకు లోబడే ఉన్నానని ప్రభుత్వాన్ని నిబంధనల ప్రకారం తీసుకునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. దీంతో తహసిల్దార్ వెంకటేశ్వరి వచ్చి రైతులు, మిల్లర్లును సంయుక్తంగా సమావేశపరిచి మాట్లాడారు. ఇటువంటి పరిస్థితుల్లో గతంలో అనేకసార్లు ధాన్యం మిల్లర్లు తీసుకునేందుకు ప్రభుత్వం క్వింటాల్‌కు రెండు కేజీలు చొప్పున నష్టం వసూళ్లకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఆమేరకు రైతు నష్టం చెల్లించి ధాన్యాన్ని దింపుకోవచ్చని, నష్టం భరించాల్సిందే తప్పదని రైస్ మిల్లర్‌కు ఆమె ఒప్పించారు. అయితే రెండు రోజులు తమ వాహనాలు ఇక్కడ ఉండిపోయినందున నష్టపరిహారం చెల్లిస్తేనే తాము ధాన్యం దిగుమతి చేస్తామని రైతులు పట్టుబట్టారు. తనకు ఇప్పటికే రూ.20 వేలు రవాణా ఖర్చులు అయ్యాయని, మిల్లర్లు ఆ ఖర్చులు భరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మిల్లు ముందే ధాన్యం వలకబోసి వెళ్లిపోతామని ఆగ్రహించారు. ఈ దశలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సరోజిని వచ్చి ఆమె రైతులకు నచ్చజెప్పినప్పటికీ రెండు బస్తాల నష్టం చెల్లించేది లేదని, తమకు వాహనాలు నిలిచిపోయినందుకు డెమరేజి చెల్లించాలని పట్టుబట్టు కూర్చున్నారు. ఈ దశలో రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వానపల్లి బాబురావు రంగ ప్రవేశం చేశారు. రైతుతో, మిల్లర్లతో విడివిడిగా పది నిమిషాలు మాట్లాడి సమస్యను సానుకూల పరిచారు. ఎవరి నష్టం వారే భరించే విధంగా అంగీకరింపజేశారు. రైతులు ధాన్యం దిగుమతి చేసుకోవడం వల్ల మిల్లర్లకు విపరీతమైన నష్టం వస్తుందని ఆయన రైతుకు వివరించారు. నష్టాన్ని మిల్లర్‌కు చెల్లించనవసరం లేకుండా రైతుని, ఆ మేరకు మిల్లర్‌ను ఒప్పించారు. డెమరేజీ ఉండదు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టం మీరే భరించాలి కాబట్టి ధాన్యం దిగుమతి చేసి వెళ్లండి అని రైతును ఒప్పించారు. దీంతో ఇరు వర్గాల వారు ఆయన మాట అంగీకరించడంతో కథ సుఖాంతమైంది.

నిలిచిపోయిన ట్రాక్టర్లు



నిలిచిపోయిన ధాన్యం ట్రాక్టర్లు..

పిల్లల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చిన్న పిల్లల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరని భీమవరం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మొగళ్ల వెంకట రమణారావు అన్నారు. ఎవరైనా తప్పిపోయిన పిల్లలు కనిపిస్తే వారిని దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌కుగాని, ఆధార్ కేంద్రాలకుగాని తీసుకెళ్తే వారి వేలిముద్రల ఆధారంగా పిల్లల చిరునామా తెలుసుకోవచ్చన్నారు. పిల్లలను సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. శనివారం అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎడ్వర్డ్ ట్యాంక్ వద్ద ఉన్న సచివాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఉండవల్లి రమేష్ నాయుడు, కండిబోయిన గిరి, ఉచిత న్యాయవాదులు బి.సురేష్ కుమార్, ఎన్.సుధీర్, బి.లోకేశ్వరరావు, ఎంబి.భవానీ, కె.జ్యోతి, సచివాలయ విఆర్ఒ తదితరులు చట్టాలపై అవగాహన కల్పించారు.




మాట్లాడుతున్న వెంకట రమణారావు

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని వేములదీవి, గొందిమూల గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఇటీవల గ్రామం సెంటర్‌లో చలివేంద్ర కేంద్రాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేయగా శనివారం గ్రామానికి చెందిన కౌరు ఏడుకొండలు ఆర్థిక సహాయంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. రహదారి గుండా పోయే వాహనదారులకు, వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం నడిచి వెళ్లే భక్తులకు, గ్రామంలోని పలుచోట్ల ఉపాధి హామీ కూలీలకు కౌరు ఏడుకొండలు మజ్జిగ పంపిణీ చేశారు.



మజ్జిగ అందజేస్తున్న ఏడుకొండలు

మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు జీతాలు విడుదల

సిఐటియు హర్షం

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ స్కూల్ స్వీపర్స్‌కు అనేక నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వడంపై శనివారం సిఐటియు మండల కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపి, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్‌లు మాట్లాడుతూ మున్సిపల్ స్కూల్స్, గవర్నమెంట్‌లోకి మార్పులు చేయడం వల్ల గత 14 నెలలు స్వీపర్స్‌కి వేతనాలు లేవన్నారు. ఎన్నోసార్లు ఆందోళన చేయగా ప్రభుత్వం స్వీపర్స్ మున్సిపాలిటీ నుంచి ఇవ్వమని జిఒ రూపంలో ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇప్పుడు ప్రస్తుతం 10 నెలల వేతనాలు అధికారులు ఇచ్చారన్నారు. స్కూల్ స్వీపర్స్‌కి పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ రోజుల్లో నెలకు రూ.4 వేలు ఏమాత్రం చాలవన్నారు. ప్రతీనెలా స్వీపర్స్‌కి బ్యాంక్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు. స్వీపర్స్‌కి వేతనాలు ఇచ్చిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పోరాడితే ఎలాంటి సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు గార రంగారావు, శారద, సత్యవతి, రత్నం, బంగారమ్మ, వరలక్ష్మీ పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు..

మార్టేరు-పాలకొల్లు రహదారి విస్తరణ

రోడ్డు భవనాల శాఖ ఎఇ డిఎస్ఎన్.మూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రక్కిలంక-నరసాపురం రోడ్ మార్గంలో మార్టేరు జంక్షన్ నుంచి పాలకొల్లులోని లారీ స్టాండ్ వరకూ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని రోడ్డు భవనాల శాఖ పాలకొల్లు డివిజన్ ఎఇ డిఎస్ఎన్.మూర్తి తెలిపారు. శనివారం మార్టేరులో ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సిఆర్ఎఫ్ గ్రాంట్‌కు చెందిన రూ.20 కోట్ల నిర్మాణ వ్యయంతో రోడ్డు మైలు రాయి 11/400 నుంచి 22/400 వరకు 11 కిలోమీటర్లు రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని అన్నారు. ప్రస్తుతం వేసవి వల్ల విజ్జేశ్వరం-నరసాపురం కెనాల్‌లో నీటి పారుదల లేనందున విస్తరణలో భాగంగా రిటైనింగ్ గోడల నిర్మాణ పనులు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే జగన్నాధపురం, కవిటం కాల్వల వద్ద కొంతమేర రిటైనింగ్ గోడల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు.



సాగుతున్న రహదారి విస్తరణ పనులు

నీట మునిగిన ఉప్పుమడులు

ప్రజాశక్తి - నరసాపురం

రెమాల్ తుఫాన్ వల్ల తీరంలో వర్షాలు కురిసాయి. కొద్దిపాటి వర్షానికి తీరంలో ఉన్న ఉప్పుమడులు నీట మునిగాయి. ప్రతి ఏడాది మే, జూన్ నెలలో ఉత్పత్తి జరుగుతుంది. ఏడాది తుఫాన్ వల్ల కురిసిన చిన్నపాటి వర్షానికి ఉప్పుమడిలు మునిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రైతులు పండిన ఉప్పుమడిపై బరకాలు కప్పుకుని భద్రం చేసుకున్నారు. నరసాపురం మండలంలో పలుచోట్ల ఇంకా వరి కోతలు జరుగుతున్నాయి. రైతులు పండించిన ధాన్యం నీటిపాలవుతాయని భయపడుతున్నారు.



వర్షం కారణంగా నీటిమయమైన ఉప్పుమడులు

వాతావరణం మార్పుతో ఆక్వా రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఆకివీడు

గత 36 గంటలుగా వాతావరణంలో మార్పు రావడంతో ఆక్వా రైతుల్లో ఆందోళన ప్రారంభమైంది. చేప, రొయ్యల ఉత్పత్తిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో తీవ్ర మార్పు చోటు చేసుకుంది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమైంది. ఎండ కాస్త మబ్బుగా మారింది. అయితే వాన కురిస్తే మాత్రం ఆక్వా రైతుకు అంత పెద్ద ఇబ్బంది ఉండదు. ప్రత్యేకించి చేపలకు వాన కురిస్తే ఆక్సిజన్ లోపం ఏర్పడే అవకాశం ఉండదు. ఒక్కసారిగా ఎండ చల్లబడి వాన కురవకపోవడంతో ఆక్సిజన్ లోపం ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. శనివారం ఉదయం కొద్దిసేపు నామమాత్రంగా ఇక్కడ ఎండ కనిపించింది. అది కూడా చాలా తక్కువ స్థాయిలో, అనంతరం మళ్లీ ఆకాశం మేఘావృతమైంది. అయితే గత 40 గంటలుగా ఇక్కడ వాన చినుకు మాత్రం పడలేదు. ఎండ తీవ్రంగా ఉండి ఒకేసారి వాతావరణం మార్పు ఏర్పడడంతో చేపలు ఆక్సిజన్ అందక ముట్టి తెరిచి చనిపోయే ప్రమాదం ఉంటుంది. దీంతో రైతులకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది. ప్రస్తుతం అదే పరిస్థితి శనివారం రాత్రి వరకూ ఇక్కడ ఆకాశం మేఘావృతంతో, పలు చోట్ల చెరువుల్లో చేపలు తేలిపోయాయి. గత రెండు రోజులుగా ఈ పరిసర ప్రాంతాల్లో సుమారు పదివేల ఎకరాల పైబడి చెరువుల్లో చేపలు తేలిపోయి ఉంటాయని రైతులు అంటున్నారు.

ఆ చెరువులో చాపలు పూర్తిగా తెలిపోతే కోట్ల రూపాయలు పైబడి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. మొత్తం మీద వాతావరణం చల్లబడిందని నాగరిక ప్రపంచంలో ఆనందపడే పరిస్థితి కన్నా, ఈ ప్రాంతం కోట్లాది రూపాయలు నష్టపోతోందని ఆందోళన పెరిగిపోయింది.

రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో రెండో రోజు శనివారం కూడా వర్షం కురిసింది. కురిసిన వర్షానికి రహదారులు ఛిద్రంగా మారాయి. మొగల్తూరు నుంచి కొత్తపాలెం మీదుగా భీమవరం గ్రామీణ మండలం వేంప వెళ్ల రహదారిపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరు శేరేపాలెం రహదారి చిత్తడిగా మారింది. పలువురు ప్రమాదాలు బారిన పడ్డారు.



గోతులలో వర్షపు నీరు చేరి.. రోడ్డుపై నిలిచిన నీరు



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

వేసవి విజ్ఞాన శిబిరంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా శనివారం పిల్లల చేత పుస్తక పఠనం, ప్రతిభా పఠనం చేయించడం, నలుగురు స్నేహితులు కథలు వినిపించడం జరిగింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తాడి ప్రిన్స్ ప్రవీణ్ గుడ్ కెరీర్ స్కిల్ డెవలప్మెంట్ కమ్యూనికేషన్ స్కిల్స్ గురించి వివరించారు. శ్రీనివాస్ తెలుగు క్లాసులు, యోగా, మెడిటేషన్ సాధన చేయించడం, కరాటేలో లోయర్ పంచ్, మిడిల్ పంచ్, అప్పర్ పంచ్‌లో తామరపు కృష్ణ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులలో సూర్యం బాబు, సుధీర్ మోహన్, సురేష్ పాల్గొన్నారని గ్రేడ్-1 లైబ్రేరియన్ కె.పి.ఎన్.ఎల్.కుమారి తెలిపారు.

నెలంతా ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - ఆకివీడు

ఈనెల 17వ తేదీన ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా నెల మొత్తం కార్యక్రమాలు, శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. వృద్ధుల సంక్షేమ సంఘం కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ఇక్కడికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బిపి కారణంగా ఎంతో మందికి ఆరోగ్యపరంగా ఎన్నో తీవ్ర పరిణామాలు ఏర్పడుతున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల మొత్తం ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో ఈ కార్యక్రమం మరో డాక్టర్‌తో అదనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

కాచిన నీరు తాగండి

వాతావరణ మార్పుల కారణంగా మంచినీటి ప్రభావంతో అనేక అనారోగ్యాలు ఏర్పడే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు సూచించారు. నీటి కలుషిత ప్రభావంతో జ్వరాలు పెరుగుతున్నాయని, తగిన జాగ్రత్తలు వహించాలని చెప్పారు. వర్షాల కారణంగా పెరిగిపోతున్న ముసురునీటితో దోమలు పెరుగుతున్నాయన్నారు. వాటి ప్రభావంతో డెంగీ వచ్చే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అందుకని ముందుగానే దోమల నివారణ మందును స్ప్రే చేయించుకోవాలన్నారు. స్థానిక ప్రభుత్వాలు, ఇతర అధికారులు అందుకు శ్రద్ధ వహించాలన్నారు. నిల్వ ఉంచిన నీరు, ఆహార పదార్థాలు, ఫ్రిడ్జ్‌లో ఉంచిన పదార్థాలు ఎక్కువగా వాడద్దన్నారు. ఎక్కువ కాలం నిలువ ఉన్న నీరుని వినియోగించొద్దన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసిన వైద్య ఆరోగ్యశాఖ భవనాలకు పైపులు, విద్యుత్ కనెక్షన్లు లేని కారణంగా ప్రారంభాలు ఆగాయన్నారు. వాటి సమస్య తీరగానే ప్రారంభిస్తామని తెలిపారు.



గోతులు పూడ్చిస్తున్న దాత మామిడి శెట్టి పెద్దిరాజు

సీసీ రహదారిపై గోతులు

ప్రయాణికుల వెతలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండలం వల్లూరు, గుమ్మలూరు వెళ్లే ఆర్అండ్‌బి ప్రధాన రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వాహన చోదకులు గోతుల్లో పడి స్వల్ప గాయాలతో బయటపడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక దాత మామిడి శెట్టి పెద్దిరాజు స్పందించి తన సొంత ఖర్చులతో సిమెంటుతో గోతులను పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నేరాలు - ఘోరాలు

రహదారి ప్రమాదంలో మహిళ మృతి

ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

రహదారి ప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటన కాళీపట్నంలో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం శేరే దగ్గు మిల్లి గ్రామానికి చెందిన బొర్ర తులసి లక్ష్మీ ప్రసాద్ భార్య విష్ణువర్ధని వారి ఇంటి సమీపంలోని మరో 5 గురు వ్యక్తులు, ఇద్దరు చిన్నారులతో కలిసి తూర్పుగోదావరి జిల్లా వాడపల్లిలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఆటోలో బయలుదేరారు. విజయవాడ నుండి నరసాపురం వెళ్ళ సిమెంట్ లోడు లారీ కాళీపట్నం తూర్పులో రహదారి పక్కన నిలిపి ఉంది. సిమెంటు రవాణా లారీను తులసి లక్ష్మీ ప్రసాద్ కుటుంబ సభ్యుల ప్రయాణిస్తున్న ఆటో తెల్లవారుజామున ఐదు గంటలకు వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ఆయన భార్య విష్ణువర్ధని(52) సంఘటనా ప్రాంతంలోనే మృతి చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారందరికీ చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రయివేట్ ఆస్పత్రికి అత్యవసర వాహనంలో తరలించామని ఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో ఇరువురి చిన్నారులు ఏవిధమైన గాయాలు కాకుండా బయటపడ్డారని ఎస్ఐ తెలిపారు. విష్ణువర్ధని మృతదేహాన్ని నరసాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించామని తెలిపారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలీని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - నరసాపురం

గోదావరిలో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చిందని నరసాపురం రూరల్ ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసాపురం మండలం రాజులంక ఏటిగట్టు వద్ద గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొచ్చిందన్నారు. మృతుడు వయసు 40-50 మధ్య ఉండవచ్చని, సదరు మృతుని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుని ఒంటిపై తెలుపు రంగు కలిగిన ఆఫ్ హాండ్స్ బనియోలు, నలుపు రంగు చొక్కా, మృతుడు తన నడుంచుట్టూ ఎరుపు, తెలుపు రంగు కలిగిన టవల్ కట్టుకుని ఉన్నాడన్నారు. మృతుని వివరాలు తెలిసిన యెడల నరసాపురం రూరల్ సిఐ 9440796616, ఎస్ఐ 9440796618 సమాచారం అందించాలని కోరారు.

పరిస్థితి విషమించి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - యలమంచి

మండలంలోని గుంపర్రు గ్రామానికి చెందిన సత్తినీడి వెంకట రామకృష్ణ(67) రెండు రోజుల క్రిందట పురుగు మందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రామకృష్ణ ఈనెల 22వ తేదీన పురుగుమందు తాగడంతో కుటుంబ సభ్యులు పాలకొల్లులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రామకృష్ణ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి విద్యార్థినీ ఉన్నతంగా తీర్చిదిద్దుతాం..

ఆదిత్య స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కృష్ణంరాజు





ప్రజాశక్తి - భీమవరం టౌన్

తమ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థినీ ఉన్నత శిఖరాల వైపు నడిపించడమే తమ ఆదిత్య స్కూల్ యాజమాన్యం లక్ష్యమని ఆదిత్య స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లైన్ డాక్టర్ ఎస్‌విపికెహెచ్ జి.కృష్ణంరాజు అన్నారు. స్థానిక అడ్డవంతెన వద్ద సూర్యనారాయణపురంలోని స్కూల్‌తో పాటు హౌసింగ్ బోర్డులో ఆదిత్య స్కూల్ విద్యార్థులకు మంచి విద్యా కేంద్రంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కృష్ణంరాజు ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆదిత్య స్కూల్ 30 సంవత్సరాల చరిత్రలో తమ విద్యార్థులు చదువులోనూ, క్రీడల్లోనూ ఎన్నో విజయాలు సాధించారన్నారు. అతి తక్కువ ఫీజులు తీసుకుంటూ ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ విద్య బోధన చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ఆరో తరగతి నుంచి విద్యార్థులకు ఐఐటి అండ్ నీట్ కోర్సుల్లో శిక్షణ, మూడో తరగతి నుంచి ఏడవ తరగతి వరకు విద్యార్థులకు రోబోటిక్, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. తమ ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ఉన్నతమైన ఆలోచనలతో విద్యార్థులను ఉన్నతమైన శిఖరాలు అధిరోహించడానికి తమ లక్ష్యం వైపు, వారి తల్లిదండ్రుల లాగా ముందుకు నడిపిస్తామన్నారు. అందువల్లే ప్రతి ఏడాది తమ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో ఆదిత్య విద్యార్థుల ప్రభంజనం

2024 పదో తరగతి పరీక్షలకు 167 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 100కు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 600 మార్కులకు గాను జి.మానస్విని 592 మార్కులు సాధించి భీమవరంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. 54 మంది విద్యార్థులకు 540కి పైగా మార్కులు వచ్చాయని తెలిపారు. 80 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని, తమ ఉపాధ్యాయుల కృషి ఫలితమేనని వివరించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణంరాజు

క్రీడల్లో మేటి..

చదువుల్లోనే కాకుండా క్రీడల్లోనూ తమ విద్యార్థులు దూసుకుపోతున్నారని, జాతీయ రాష్ట్రాల్లో జరిగిన అన్ని రకాల పోటీల్లో అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారని కృష్ణంరాజు తెలిపారు. అలాగే జాతీయస్థాయి సైన్స్ ప్రదర్శనలో విద్యార్థులు గ్యాస్ లీకేజీ డిటెక్టర్‌ను రూపొందించారన్నారు. అంతేకాకుండా ఆత్మస్థైర్యం కోసం కరాటితోపాటు మానసిక వలస కోసం కబడీ, కోకో, రన్నింగ్ వంటి ఎన్నో క్రీడల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని దీనికి తమ ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు.

గ్రామీణ ప్రాంత విద్యాభివృద్ధే వివేకానంద లక్ష్యం

మూడు దశాబ్దాల విద్యాప్రగతికి ఉపాధ్యాయులదే కీలక పాత్ర

మార్టేరు వివేకానంద స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ గుడిమెట్ల రామారెడ్డి





ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామీణ ప్రాంతమైన మార్టేరులో ఆంగ్ల విద్యాభోదన ద్వారా విద్యా ప్రగతిని కోరుకుంటూ ధైర్యంగా వివేకానంద స్కూల్‌ను ఇంగ్లీష్, తెలుగు భోదనా మీడియంలలో ప్రారంభించామని పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ గుడిమెట్ల రామారెడ్డి అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 1994 ఏప్రిల్ 25న స్వామి వివేకానంద ఆశయాలు, ప్రేరణతో వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ స్థాపించామని తెలిపారు. ప్రారంభంలో ఎల్‌కెజి నుంచి 3వ తరగతికి విద్యా శాఖ నుంచి అనుమతి పొందామని, తర్వాత వరుసగా ప్రతీ సంవత్సరం పైతరగతిని అంచెలంచలుగా పెంచుకుంటూ వెళ్లామని రామారెడ్డి వివరించారు. ఆవిధంగా ఎల్‌కెజి, యుకెజిలకు, 1 నుంచి 5 తరగతులకు, అనంతరం 6 నుంచి టెన్త్ వరకు మూడు విద్యా విభాగాలకు రికగ్నేషన్ పొదడం జరిగిందని అన్నారు. 2005 - 2006 విద్యా సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ వెళ్లడం దగ్గర నుంచి ప్రతీ సంవత్సరం నూటికి నూరు శాతం మేరకు 10/10లతో ముందుకు సాగామని, కరోనా అనంతరం వరుసగా మూడు విద్యా సంవత్సరాల్లో మండల, టౌన్ స్థాయిల్లో మంచి మార్కులతో తమ పాఠశాల విద్యార్థినులు వరుసగా ఎం.దీప్తి(552), ఎస్.త్రిపుర సుందరి(560) ఈ విద్యా సంవత్సరం కె.జోషిణీ రమ్య(572) ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

గ్రామీణ ప్రాంత విద్యా ప్రగతి కోరుతూ స్థాపించిన ఈ పాఠశాల మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయుల కృషి కారణం అన్నారు. ప్రతీ సంవత్సరం 550-600 మంది విద్యార్థులతో పాఠశాల ఉండడానికి తల్లిదండ్రుల నమ్మకమే బలమైన శక్తి అన్నారు. తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్యను తాము అందిస్తున్నామని, ఈ పాఠశాలలో టెన్త్ పాసై వెళ్లిన వందలాది మంది విద్యార్థులు తర్వాత మెరుగైన విద్యాప్రగతి సాధించి, ప్రస్తుతం దేశ, విదేశాల్లో సాఫ్ట్ వేర్, కార్పొరేట్, బ్యాంక్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, పలువురు బాస్కెట్ బాల్, కబడ్డీ వంటి క్రీడల్లో రాణిస్తున్నారని రామారెడ్డి వెల్లడించారు.

రక్షణ చట్టంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పిల్లలను రక్షించడానికి రక్షణ చట్టంపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సివిల్ జడ్జ్(సీనియర్ డివిజన్) జి.గంగరాజు అన్నారు. నేడు అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవం సందర్భంగా నర్సాపురం మండల న్యాయ సేవాధికారా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు అధ్యక్షతన డ్వాక్రా మహిళలకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు పాల్గొని మాట్లాడారు. 1983లో ప్రారంభమైన ఈ ప్రత్యేక దినాన్ని ప్రతి సంవత్సరం మే 25న జరుపుకోవడం పరిపాటన్నారు. ప్రతి సంవత్సరం దాదాపు 96 వేల పిల్లలు అపహరణకు గురవుతున్నారన్నారు. పిల్లలను రక్షించడానికి రక్షణ చట్టంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉన్నత న్యాయస్థానాలు ప్రత్యేక దృష్టి పెట్టాయన్నారు. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారో, స్కూల్‌లో వారి ప్రవర్తన ఎలా ఉందో తరచూ తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం పిల్లలు ఎక్కువగా సోషల్ మీడియాకు ప్రభావితులై తల్లిదండ్రులకు చెప్పకుండా పారిపోతున్నారన్నారు. బాలికలను అపహరించి, అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. చిన్నతనం నుంచి పిల్లలకు మంచి, చెడు నేర్పించాలి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వల్ల కుటుంబ బాంధవ్యాలపై బాధ్యత ఉంటుంది. ఒంటరిగా ఎవరైనా పిల్లలు అనుమానాస్పదంగా కనిపిస్తే 1098కి కాల్ చేస్తే శిశు గృహ డిపార్ట్మెంట్ వారు వారికి వసతి కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు, జనరల్ సెక్రటరీ ఆర్‌జి.కుమార్, చిట్టి పద్మజ, కార్యవర్గ సభ్యులు, ప్యానల్ లాయర్‌లు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



తణుకు: అవగాహన కల్పిస్తున్న ప్యానెల్ న్యాయవాదులు.

తణుకు: తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని, తల్లిదండ్రుల్లో ఐక్యత లేకపోవుట వల్ల పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోతున్నారని తణుకు ప్యానెల్ న్యాయవాదులు అన్నారు. శనివారం ఇంటర్నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సులో నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు కొండాలమ్మ గుడి రోడ్డులో ఉన్న స్లమ్ ఏరియా కాలనీ వాసులకు, తల్లిదండ్రులకు ప్యానెల్ న్యాయవాదులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ కొన్ని కుటుంబాల్లో ఆర్థికపరమైన కారణాల వల్ల పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోతున్నారని, కొంత మంది చెడు స్నేహాల వల్ల ఇల్లు విడచి వెళ్లి జీవితాలు పాడు చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కొంతమంది ముఠాలుగా ఏర్పడి పిల్లలను అపహరించి కుంటి వారిగా, గుడ్డి వారిగా చేసి భిక్షాటన చేయిస్తారని, అట్లాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండి పిల్లల్ని రక్షించుకోవాలని సూచించారు. ఎవరైనా పిల్లలు రైల్వే స్టేషన్, బస్ స్టాండ్‌లలో అనుమానాస్పదంగా ఎదురుపడితే వెంటనే 1098 చైల్డ్ లైన్‌కు, 100 పోలీసులకు తెలియజేయాలని, గుర్తించిన పిల్లలను చిల్డ్రన్ హోంలకు తరలించి తదుపరి తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుందన్నారు. పిల్లలను పనిలో పెట్టుకొనుట, పనులు చేయించడం నేరమని అట్లాంటి వారికి జరిమాన, జైలు శిక్ష ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎ.అజయ్‌కుమార్, టి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపు

గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు

ప్రజాశక్తి - కాళ్ల

క్రీడలతోనే ఆత్మవిశ్వాసం, స్నేహభావం పెంపొందుతుందని గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు అన్నారు. ఏలూరుపాడు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ప్రారంభమైంది. ఈ టోర్నమెంటును మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ క్రికెట్ టోర్నమెంటు 20 రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు 20 జట్లు నమోదు చేసుకున్నాయన్నారు. గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు మొదటి బహుమతి రూ.40 వేలు విరాళం అందించారు. మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు రెండో బహుమతి రూ.25 వేలు విరాళం అందించారు. పడమట పర్రాజు మూడో బహుమతి రూ.15 వేలు విరాళం అందించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతిని సుదాబత్తుల వంశీకృష్ణ రూ.5 వేలు విరాళం ఇచ్చారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులు పడమట సుబ్బయ్య రూ.10,116 విరాళం ఇచ్చారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్ రూ.2,500, బెస్ట్ బౌలర్‌కు రూ.2,500 బహుమతులను జ్ఞానానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సంస్థ కరస్పాండెంట్ దాట్ల శ్రీనివాసరాజు విరాళాన్ని అందించారు. వక్కపట్ల హరిబాబు రూ.3 వేలు, నల్లగచ్చు నాగార్జున రూ.2 వేలు విరాళాన్ని అందించారు. మాజీ ఉప సర్పంచి పడమట సత్యనారాయణ, ఏలూరుపాడు గ్రామ యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న గ్రామ ప్రముఖులు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 48 మంది ఎంపిక

కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 48 మంది విద్యార్థినులు ఎంపికైయ్యారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పిజీ(అటానమస్)లోని ప్లేస్‌మెంట్ సెల్, భవ్యన్ టెక్నాలజీ సొల్యూషన్స్, చెన్నై వారు సంయుక్తంగా శనివారం కళాశాల క్యాంపస్‌లో టాటాక్వెష్(కనెక్ట్ బిజినెస్ సొల్యూషన్స్) ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థినులు చెన్నై, హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తారని, వారి వార్షిక ఆదాయం రూ.2లక్షల 40 వేలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ లెఫ్టనెంట్ యు.లక్ష్మీసుందరీబాయ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థినులు అభినందించారు.

వృద్ధుల సంఘం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఆకివీడు

వృద్ధుల సంక్షేమం కోసం ఆకివీడు వృద్ధుల సంక్షేమ సంఘం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక కొల్లేరు ప్రజల వైద్య దేవతగా ఇక్కడ పేరుగాంచిన డాక్టర్ కె.జానకి జయంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం, ప్రముఖ రైస్ మిల్లర్ గొట్టుముక్కల శ్రీరామరాజుల జ్ఞాపకార్థం స్థానిక సర్దార్ కాటన్ ఆకివీడు మండల వృద్ధుల సంక్షేమ సంఘం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు లయన్స్ డాక్టర్ ఎం.సూర్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగిన సభలో డిఎంహెచ్ఓ మహేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ఇరువురి చిత్రపటాలకు నివాళులు ఘటించారు. వందమంది వృద్ధ, పేద మహిళలకు చీరలు, భోజనాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా వృద్ధుల కోసం సంఘం చేసిన కృషిని వివరించారు. అనంతరం వృద్ధుల సంఘం నాయకులు అడివి సుబ్బారావు, పేర్ల ప్రసాదు, పల్లె అప్పిరెడ్డి, నేరెళ్ల ఆదినారాయణ, విజె కోటేశ్వరరావు బాబు, శివరామకృష్ణంరాజు, ఎస్కోటేశ్వరరావు తదితర సభ్యులను లయన్స్ క్లబ్ సత్కరించింది. లయన్స్ క్లబ్ నాయకులు సూర్యనారాయణ రాజు, దాట్ల రామరాజు, పల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

ఉప కారాగారం తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.శ్రీనివాసరావు స్థానిక ఉప కారాగారాన్ని శనివారం తనిఖీ చేశారు. ముందుగా వంటశాలను, ఆహార పదార్థాలను, జైల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆహార నాణ్యతపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్‌లపై అవగాహన కల్పించారు. బెయిల్‌పై బయటకు వెళ్లిన వారు కేసు పూర్తి అయ్యే వరకు ప్రతీ వాయిదాకు హాజరు కావాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం ప్యానల్ న్యాయవాదులను ఉపయోగించుకోవాలన్నారు. జైల్ విజిటింగ్ లాయర్ శిరీష, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ చాముండేశ్వరి, పిఎల్‌వి.వరలక్ష్మి, ఉప కారాగారం పర్యవేక్షణ అధికారి టి.అప్పారావు, శశికళ, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సాంస్కృతిక ఉద్యమ సంస్థ ప్రజానాట్యమండలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

70 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ప్రజా సంస్కృతి ఉద్యమ సంస్థగా రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఇండియన్ పీపుల్ థియేటర్ అసోసియేషన్ ఇప్టా వారసురాలుగా ఏర్పడిన ప్రజానాట్యమండలి కళ కోసం కాదు కళా ప్రజల కోసం అని తెలుగు నాట ప్రజానాట్యమండలి నిలిచిందని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. శనివారం ప్రజానాట్యమండలి 81వ వార్షికోత్సవం స్థానిక హౌసింగ్ బోర్డ్‌లో జరిగింది. సామ్యవాద సిద్ధాంతాల పునాదితో దైనందిన జీవితంలో సామాన్య ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై జన బాహుల్యానికి అవగాహన కల్పించే ఆశయంతో ప్రజానాట్యమండలి పనిచేస్తుందని ఆయన అన్నారు. 81 సంవత్సరాలుగా ప్రజానాట్యమండలి ప్రజల మధ్య ఉంటూ పాటలు, బురకథ, హరికథ నాటకాలు, నాటికలు, నృత్యం నాటికలు ప్రదర్శించి ప్రజలను చైతన్యవంతులుగా చేసిందన్నారు. తిరుమని చంటి రాజు, తిరుమని కామేశ్వరరావు ,కాటి వెంకటరత్నం విప్లవ గేయాలు ఆలపించారు. ముందుగా మాదాల రంగారావు, కపర్తి చిత్రపటాలకు పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో తమరి సాంబమూర్తి, ఎం.శ్రీనివాసరావు, చాన్ బాషా, కళా రంజని వ్యవస్థాపక అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్, కళాకారులు పాల్గొన్నారు.

పూడిక తొలగించాలి

ఇరిగేషన్ అధికారులను కోరిన బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వచ్చే వర్షాకాలంలో ఎర్ర కాలువ రైతులు ఇబ్బంది పడకుండా నందమూరి అక్విడెక్టు వద్ద పూడికను తొలగించాలని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను కోరారు. తాడేపల్లిగూడెం మండలం నందమూరి అక్విడెక్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్ద ఎత్తులో ఇసుకమేటలు వేసి అక్విడేట్ మొత్తం పూడికపోయే పరిస్థితిలో ఉంటే ఆ పనులు రైతుల చేసుకోవాలని చెప్పడం సమంజసం కాదని, అధికారులకు నివేదించి వెంటనే ఈ పూడిక తీయించాలని కోరారు. రైతులకు తాను అండగా ఉంటానని, పూడిక పనులకు సమయం లేనందున అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్తానని బొలిశెట్టి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందమూరు, శెట్టిపేట, మారంపల్లి ఆరుల్ల గ్రామాలకు చెందిన రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాదం ఉన్న పార్టీ వైసిపి

గూడూరి ఉమాబాల

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజా ఆశీర్వాదం ఉన్న వైసిపికి దైవం ఆశీర్వాదం కూడా తోడవ్వాలని వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల కోరారు. భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, నర్సాపురం పార్లమెంటరీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గెలుపు కోసం భీమవరం నుంచి చిన్న తిరుపతికి వైసిపి శ్రేణులు యాత్ర చేపట్టారు. భీమవరంలోని మావుళ్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైసిపి నాయకుల యాత్రను నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరు ఉమాబాల జెండా ఊపి ప్రారంభించారు. భీమవరంకు చెందిన వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు 100 మంది వరకూ ఈ యాత్రలో పాల్గొని ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి కార్లతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల మద్దతు, ఆదరణ జగన్మోహన్ రెడ్డిపై ఉందని, జగన్ మళ్లీ సీఎం కావాలని, భీమవరం నుంచి గ్రంథి శ్రీనివాస్ మళ్లీ ఎంఎల్‌ఏగా గెలవాలని, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా తన విజయాన్ని కోరుతూ వైసిపి శ్రేణులు, అభిమానులు చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం జెడ్‌పిటిసి కాండ్రేకుల నరసింహారావు, వైసిపి నాయకులు తోట భోగయ్య, చిన్నమిల్లి రాయుడు, బండి సాంబమూర్తి పాల్గొన్నారు.